కళ్ళజోడు

టి. ఎ. రస్తోగి



"....." డాక్టరు చంద్రమోహన్ ఏదో చెప్పాడు. ఆ మాటలేమీ రమణకు విన్పించడంలేదు. అతనికి ఈ ప్రపంచం తలకిందులైనట్లనిపించింది.

బుజంమీద పెద్దచెయ్యి పడగానే, రమణ అదిరిపడి చంద్రమోహన్ ముఖంలోకి చూశాడు.

"ఇంతకన్నా వేరొకమార్గంలేదు. అలా చేద్దాం అని నీవు అంటే వారంరోజుల్లో అన్నీ ఏర్పాటు చేస్తాను."

మౌనం వహించాడు రమణ.

రమణ కళ్లలో తన కొడుకు రంగడు మెదులుతున్నాడు. వాడి బ్రతుకు ఎలా సాగిపోతుందో!

"ఇదేమీ కొత్త విషయంకాదు. ఈ రోజులలో ఇలాంటి కేసులు చాలా కనిపిస్తున్నాయి." చంద్రమోహన్ కొంచెం నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు.

రమణ రంగడి భవిష్యత్తు తలపోసుకుని కుమిలిపోయాడు. పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేకపోయాడు. అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. పక్కన ఉన్న రంగడి ముఖంవంక దీనంగా చూశాడు. రంగడు ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నట్లున్నది. రమణ తన గతాన్ని ఒక్కసారి చూడాలనుకున్నాడు.

• • • •

రమణ కేటరింగు ఇన్‌స్టిట్యూట్‌లో చదువుతున్న రోజులు. (కేటరింగు అంటే వంటలు నేర్పే ఇన్‌స్టిట్యూట్)

ఎవరో తలుపు తట్టారు. రమణ ఉలిక్కిపడి లేచి బయటకు చూశాడు. అప్పుడే ఉదయభానుడు తన కిరణాలను వెదజల్లుతున్నాడు. బద్ధకంగా ఒళ్లు విరుచుకున్నాడు.

మళ్లీ తలుపు చప్పుడయింది.

రమణ తలుపులు తెరిచాడు.

ఒక చేతిలో బెడ్డింగు, రెండవచేతిలో చిన్నబాగ్‌తో నిలబడి ఉన్నాడు తలుపు తట్టిన వ్యక్తి. సన్నగా, దళసరి కళ్లద్దాలతో కార్టూన్‌బొమ్మలా ఉన్నాడు.

"ఎవరు కావాలి?" అని అడిగాడు రమణ.

వచ్చినవ్యక్తి కొంచెం రమణ ముఖాన్ని పరిశీలించి "రమణగారంటే మీరేనా?" అన్నాడు.

"అవును" అని, ఎందుకోసం వచ్చాడో అని, అతన్ని ఎక్కడో చూసినట్లు అనిపించగానే అతని ముఖంలోకి తీక్ష్ణంగా చూశాడు.

అంగుళం దళసరి అద్దాలలోంచి భయంకరంగా

కన్పించాయి అతని కళ్ళు. ముఖ కవళికలు చూస్తుంటే చాలా చిన్న వయస్సువాడిలా, ఏదో బాధ దాచుకున్న వాడిలా కన్పించాడు.

"నాపేరు రామరాజండి. నేను ఫస్టుఇయర్‌లో జాయిన్ అయ్యాను. ప్రిన్సిపాలుగారు నన్ను మీ రూములో ఉండమన్నారు" అంటూ రాజా ప్రిన్సిపాలు గారి ఉత్తరాన్ని రమణకు అందించాడు. ఉత్తరం తీసుకుని రమణ రెండవ తలుపుకూడా తెరిచాడు. రాజా లోపలకు ప్రవేశించాడు. చేతిలో బెడ్డింగు పక్కనపెట్టి రెండవచేతిలోని పుస్తకాలు ఎక్కడ పెట్టాలో అర్థంకాక

"ఏమండి, నన్ను ఏ అలమారా తీసుకోమంటారు?" అని అడిగాడు రాజా.

"మూడవ అలమారాలో మీ పుస్తకాలు పెట్టుకోండి. కాట్, టేబుల్ ట్యూటరుగార్ని అడిగి స్టోరు రూము నుంచి తెచ్చుకోవచ్చును."

టూత్‌పేస్టు, బ్రెష్, సోపు తీసుకుని బాత్‌రూమ్‌కి వెళ్లిపోయాడు రమణ.

బాత్‌రూమ్‌నుంచి రమణ తిరిగి వచ్చేసరికి రాజు తన పుస్తకాలు అలమారులో సర్దుకున్నాడు. రాజు అలమారు సర్దుకున్న తీరు చాలా అందంగా కన్పించింది రమణకి. పై అలమారులో దేవుడిఫోటోలు, మధ్య అరలో పుస్తకాలు పేర్చాడు.

రమణకు అలాంటివి ఏమీ నచ్చవు. ఇంట్లో పెద్దవాళ్ళు తిట్టినప్పటికి తన అలవాట్లను మార్చుకోలేకపోయాడు. ఎంత ఖరీదైనా సినిమానటి ఫోటో కొంటాడు. కాని దేవుడిపటం అనేది మచ్చుకైనా కన్పించదు. అందుకే రాజు అలమారువైపు చూసి లోపల నవ్వుకున్నాడు రమణ.

రాజుని ఎక్కడో చూసినట్లనిపిస్తున్నది రమణకి. 'ఎక్కడ చూశానా?' అని కొంచెంసేపు బుర్ర గోక్కున్నాడు, కాని గుర్తురాలేదు. ఆలోచిస్తూనే అన్నిపనులు — బట్టలు వేసుకోవడం, మేకప్ కావడం పూర్తి చేశాడు.

"మీవేటివ్‌స్టేషను ఏ ఊరు?" రమణ అడిగాడు.

బెడ్డింగు సర్దుకుంటున్న రాజు తలపైకిఎత్తి, "పశ్చిమగోదావరిజిల్లా పెనుగొండ" అన్నాడు.

ఇంత పొద్దున్నే ఎలా వచ్చారు? మెయిల్ ఇంకా వచ్చి ఉందదే!"

"నేను ఇక్కడికి వచ్చి నారంరోజులైంది. బృందావన్ లాడ్జిలో ఉంటున్నాను. ఈరోజు ఉదయమే మంచిదని పొద్దున్నే బయలుదేరి వచ్చానండి."

రాజు ఎంతో నెమ్మదిగా సమాధానం చెప్పాడు.

రమణకు చాలా వింతగా వినిపించిందా "మంచిది". రాజు, రమణను లేపినప్పుడు టాక్సీకాని, ఆటోరిక్షాకాని ఎక్కివచ్చినట్లులేదు. అయితే రాజు అక్కడినుంచి నడిచివచ్చాడన్నమాట.

"అయితే మీరు బృందావన్‌నుంచి నడిచి వచ్చారన్న మాట?"

అవునన్నట్లు తలఊపి రాజు తన చేతిలోని అరటి పండు రమణకు ఇచ్చాడు. రమణ దానిని అందుకుని టేబుల్ మీద పెట్టాడు.

బరువుతో నాలుగునెమ్మల్ల పడివిరిచిన తాళికి దేవుడిమీద, ఎలాంటి బలమైన నమ్మకం ఉంటో బాగా అర్థమైంది రమణకి.

ఆరోజు క్లాసుబేలు ప్రకారం పుస్తకాలు తీసుకున్నాడు రమణ. క్లాసు ఎంత అయిందో అని చేతి గడియారం తీసి చూశాడు. అది ఆగిపోయి ఉంది. దాన్ని అలమారులో పెట్టి మెస్సుకి బయలుదేరాడు.

"నేను మెస్సుకి వెళ్లి అక్కడ్నించి ఇన్‌స్టిట్యూట్‌కి వస్తాను. ఈ తాళం మీదగ్గిర ఉంచుకోండి" అంటూ తాళం అందించాడు.

"అప్పుడే ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లిపోతున్నారా? ఇంకా చాలా క్లాసుంది" అన్నాడు రాజు తాళంచెవి అందుకుంటూ.

"శనివార మంగళవారం. దోసెలరోజు. కొంచెం ఆలస్యమైతే వదిగంటకైనా టిఫిన్ అంతదు" అంటూ హడావిడిగా మెట్లవైపు వెళ్లిపోయాడు.

సాయంత్రం రమణ రూముకి తిరిగి వచ్చేసరికి రాజు కాలుకి కట్టు కట్టుకుంటున్నాడు. కాలుమీద ఏదో పెద్దగాయమైనట్లున్నది. కట్టుమీద కూడా రక్తం పొర్లింది.

"ఏమిటది? కాలుకి కట్టు కడుతున్నారు?" రమణ చాలా ఆశ్చర్యంగా అడిగాడు.

కట్టు కట్టుకుంటూ తలపైకి ఎత్తి రమణవంక జాలిగా చూశాడు. చిన్నబోయిన ముఖంలో దశసరి అడ్డాల వెనకమండి అతని కళ్ళు చిన్నగా రమణవైపు చూశాయి.

"కుర్చీలోంచి పడిపోయానండి" అన్నాడు.

ఆ మాటలతో ఏదో బాధ తొంగి చూసింది.

రాజు చెప్పిన సమాధానం రమణ అనుమానాన్ని నివృత్తి చేయ్యలేకపోయింది.

"ఎలా పడిపోయారు?" రమణ తిరిగి ప్రశ్నించాడు.



"మీ క్లాసులో ఆ లావుపాటి ఆయన ఇందాక కాంటీన్‌లో ఏదో మాట్లాడాలని నాకో కుర్చీ చూపించి కూర్చోన్నారు. నేను కూర్చోగానే కుర్చీ కిందికి కూలిపోయింది. ఆ కిందఉన్న పొర్కు గుచ్చుకుని కాలు చీరుకుపోయింది."

"బాగా లోతుగా తెగిందా?" అడిగాడు రమణ లోపల నవ్వుకుంటూ.

"లేదండి! కాని నాకున్న ఒక్క కొత్తపాంటూ చిరిగిపోయింది." రాజు మాటలలో ఏదో విషాదం దాగి ఉంది. ఆ మాటలు ఎక్కడో మాతిలోంచి వస్తున్నట్లని పించింది. రమణ అదోలా అయిపోయాడు.

రమణకు తెలుసు అసలు ఆ యాక్సిడెంటు ఎలా జరిగిందో. రాజు చెప్పివాడు! అదేమిటో తెలుసుకోలేక పోయాడు! రాజుని చూస్తూంటే పోయిన సంవత్సరం తన సంగతి గుర్తుకి వస్తుంది. జరిగిపోయిన సంఘటనలు తలుచుకుంటే ఎంతో విచిత్రంగా ఉంటుంది. తను చేరిన సంవత్సరమే అక్కడ కేటరింగు ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించారు. అందువల్ల హాస్టలు వసతిలేదు. కొత్తహాస్టలు బిల్డింగు పని పూర్తి అయ్యేవరకూ దగ్గిరలో ఉన్న పాలిటెక్నిక్ హాస్టలులో వసతి ఇచ్చారు. ఆ సంవత్సరం మొదటి మూడునెలలు వాళ్ళు పడిన పాట్లు దేవుడికే తెలియాలి. "రాగింగ్, థర్డింగ్" లనే సంస్కృతికబంధహస్తాలలో పలిగిపోయారు. హాస్టలులో ఉన్నే పాలిటెక్నిక్ సీనియర్లు వాళ్లచేత డాన్సులు చేయించడం, బాత్‌రూమ్‌లలో పెట్టి తలుపులు మూసివెయ్యడం, నుంచిబీళ్లతో ఉన్న కలపడం, వాళ చేత పిల్లిమొగ్గలు వేయించడం, జంతువుల్లా ఎంచడం ఇప్పటికీ రమణ కళ్లలో మెదులుతున్నాయి. ప్రతిరోజు ఒకయుగంలా గడిచేది.

ప్రతిరోజూ పైన చెప్పిన పనులు చేయించి వాళ్లు ఆనందించేవారు. ఆ బాధ సహించలేక రమణ ఒకసారి వాళ్ల ప్రిన్సిపాలుకి చెప్పినప్పటికీ ఆయన నవ్వి రాగింగ్ అనటం తప్ప మరొకటి చెయ్యలేకపోయాడు.

తను ఎలా డాన్సు చేసిందీ, ప్రేమించడం చూపించమని సీనియర్లు వేధించడం, తనకు ఎదురుగా ఆడపిల్లలా నటించిన సీనియరు స్టూడెంటు బుగ్గను కసిగా కొరకడం తలచుకుంటే నవ్వు వస్తూంది.

రమణ ఈ బాహ్యప్రపంచంలోకి నవ్వుతూ వచ్చాడు. రమణ ఎందుకు నవ్వుతున్నాడో రాజుకి అర్థం కాలేదు. రాజు ఎలా పడిపోయాడో రమణకి పూర్తిగా తెలుసు! అప్పుడే రాగింగ్ ప్రారంభమైంది.

రమణ స్నానం చేసి వచ్చేసరికి రాజు బయటకు ప్రయాణమయ్యాడు

"నేను అలా టౌనులోకి వెళ్లివస్తానండి."

"8 గంటలు దాటిపోతే మెస్సులో భోజనం ఉండదు" రాజు కొత్తవాడుకనక ఆ విషయం తెలియపరిచాడు రమణ.

"నేను మెస్సులో చేరలేదండి. చేరే ఉద్దేశ్యం కూడా లేదు. నేను ప్రతిరోజూ బృందావన్‌కి వెడుతుంటాను. కనక అక్కడే సాయంత్రం భోజనం చేసి వస్తానండి."

"అయితే హాస్టల్‌లో మిమ్మల్ని చేరనియ్యరు." రమణ అనుమానంగా రాజు ముఖంలోకి చూశాడు.

"ఈ విషయం ప్రిన్సిపాలుగారికి తెలుసు. వారి అనుమతితోనే హాస్టలులో చేరాను."

అక్కడితో ఆ మాటలు ఆగిపోయాయి. రాజు టౌనుకి, రమణ ఓల్డుహాస్టలుకి బయలుదేరి వెళ్లిపోయారు.

రమణ భోజనం చేసి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. ఇంతలో బయటినుండి ఓ బృందం ప్రవేశించింది.

"ఒరేయ్! ఈ రోజు నాలుగుగిత్తలు దొరికాయి" వగర్చుతూ చెప్పింది ఓ స్థూలకాయం.

"నువ్వు చెప్పేది ఏమిటో అర్థం కావడంలేదురా" కొంచెం చిరాకు ప్రదర్శించాడు రమణ.

"అదేరా! రాగింగ్" పెద్దగా అరిచాడు వెంకటేశం.

"ఈ సంవత్సరం రాగింగ్ విధానాలను చర్చించడానికి నిన్ను ఆహ్వానిస్తున్నాం" రెండవ వ్యక్తి ఒయ్యారంగా పిలవిచ్చాడు.

"అలాగే! మీరు పదండి. పది నిమిషాలలో వస్తాను" అన్నాడు రమణ హుషారుగా.

వచ్చిన సంఘం బయటకు కదిలింది. వెంకటేశం రెండు అడుగులు వెనక్కివేసి

"ఏరా, ఏమయ్యాడురా మీ శుక్రాచార్యుడు" అని అడిగాడు.

"టౌన్‌లోకి వెళ్లాడు."

"రాగానే కూడా తీసుకుని గ్రౌండ్‌ఫ్లోరులో కామన్ రూమ్‌కి రారోయ్!" పోతూ పోతూ ఆదేశించాడు కాబోయే వంటలయ్య.

• • •

రాజు ఎప్పుడు వచ్చాడో తెలియలేదు. తెల్లవారేసరికి రాజు నేలమీద బెడ్డింగు పరుచుకుని నిద్రపోతున్నాడు. రమణ తన కార్యక్రమంలో తాను నిమగ్నుడైపోయాడు.

రాజు చాలా పొద్దెక్కి లేచాడు.

> మనలో లేని మంచిగుణాలు ఇతరులలో ఉండాలని అపేక్షిస్తాము. మనం మన స్వభావాన్ని మార్చుకోవడానికితప్పా మిగత ఎందుకైనా సిద్ధమవుతాము.
>
> —స్టాడర్డ్

రమణ మెస్సుకి వెళ్లివచ్చేసరికి రాజు పుస్తకాలు సద్దుకుంటున్నాడు.

"రాత్రి ఎప్పుడు వచ్చారు?" రమణ అడిగాడు.

"చాలా లేటయిందండి! బస్సు దాటిపోయింది. అందువల్ల నడిచి రావలిసి వచ్చింది!"

బయటనించి వాచ్‌మన్ పిలిచాడు.

"సార్! ట్యూటరుగారు పిలుస్తున్నారు."

రాజు కిందికి వెళ్లి, మళ్లీ వెనక్కి వచ్చాడు. రమణ సాయంతో మంచం, టేబులు, కుర్చీ తెచ్చుకుని రూమ్‌లో పెట్టుకున్నాడు.

ఆరోజు రాజు మళ్లీ బయటకి వెళ్లిపోయాడు.

రాజుకోసం సీనియర్లు వెయ్యికళ్లతో నిరీక్షించారు. మిగిలిన జూనియరు విద్యార్థులతో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యడానికి నిశ్చయించినట్లు, హాస్టలు బిల్డింగుపని పూర్తికానందున, బాత్‌రూములకు ఇంకా తలుపులు పెట్టక పోవడంవల్ల, ఆ సంవత్సరం పాత పద్ధతులు — బాత్‌రూములో బంధించడం, నగంలో కుళాయిలు కట్టివెయ్యడం ఇత్యాదులకు స్వస్తి చెప్పి ఆ నూతన విధానాన్ని అనుసరిస్తున్నట్లు రాగింగ్ కమిటీ చెయిర్మన్ వెంకటేశం, ఇన్‌స్టిట్యూట్‌నుంచి తెచ్చిన విరిగిపోయిన పోర్కుతో, వాళ్ల నాయనమ్మ పంపించిన అటుకుల డబ్బామీద చప్పుడు చేసి సూచి చెప్పాడు.

అనుకున్న కార్యక్రమం మొదలైంది. డాన్సులు, పాటలు, ప్రేమ సన్నివేశాలు — ఇత్యాది నాగరిక దృశ్యాలతో రాగింగ్ కార్యక్రమము సాగిపోయింది. ఒకాయన డాన్సు అంటే, వేరొకాయన పాట అంటే, కొత్త కుర్రాడు పాటలాంటి ఏడుపుతో, డాన్సులాంటి శివం తొక్కుతూ కీలుబొమ్మలా ఆడుతుంటే, దానికి మ్యూజిక్ ఇన్స్ట్రుమెంటుగా కాలం గడిపేశారు సీనియర్లు. ఆరోజు.

ఆరోజు రాత్రి రాజు ఎప్పుడు వచ్చాడో తెలియదు. తెల్లవారుజామున వర్షపుజల్లుకి రమణకు మెలుకువ వచ్చింది. రమణ తన మంచాన్ని కిటికీకి దూరంగా జరుపుకోవడానికి లేచాడు. కిటికీలకు ఇంకా తలుపులు కట్టనందున వర్షపుజల్లు రూములోకి వస్తున్నది. రాజు నిద్రపోతున్నాడు. కిటికీకి దగ్గిరగా ఉన్న రాజు టేబులుమీద కూడా జల్లు పడుతున్నది. టేబులు చివర కళ్లజోడు రాజుకి కాపలా కాస్తున్నట్లనిపించింది. రమణ తన మంచంతోపాటు రాజు టేబులుకూడా రూము మధ్యలోకి జరిపి నిద్రపోయాడు.

ఉదయం గదిలో ఏదో చప్పుడైంది. రమణ ఉలిక్కిపడి లేచేసరికి రాజు పడిపోయిన కుర్చీని నిలబెట్టి, చేతులతో తుడుముకుంటూ వెళ్లి రమణ మంచంమీద పడ్డాడు.

"రాజా!" అన్నాడు రమణ ఆశ్చర్యంగా.

"నా కళ్లజోడు కన్పించడంలేదండి" రాజు మాటలు చాలా బాధ కలిగించాయి.

రాజు పరిస్థితి రమణకి బాగా అర్థమైంది. కళ్లజోడు లేకపోతే ఒక్క అడుగుకూడా ముందుకుపోలేడు రాజు. రమణ కళ్లజోడు తీసి రాజుకి అందించాడు.

రాజు కళ్లజోడు పెట్టుకుని, రూమ్‌లో జరిగిన మార్పులు చూసి ఆశ్చర్యపోయాడు

"ఏమండి! నా టేబుల్ని ఇక్కడికి మీరే మార్చారా?" రాజు అడిగాడు.

రమణ జరిగిన విషయం అంతా చెప్పాడు.

'బి' బాచ్ వాళ్లకు కుక్కరీ ప్రాక్టికల్స్ ఉన్నందున రమణ తిరిగి రూముకి వెళ్లిపోయాడు. రూములో రాజు దిగాలుపడి కూర్చున్నాడు.

"క్లాసుకి పోలేదా?" రమణ అడిగాడు.

"వెళ్లానండి! కాని నన్ను క్లాసులోనికి పోనివ్వలేదండి."

"ఎందుకని?"

"ఈవాళ కుక్కరీ ప్రాక్టికల్స్. వైటు యూనిఫారం లేకుండా క్లాసుకి రాకూడదన్నారు. నాకు వైటు పాంటు లేదండి. ఉన్న ఒక్క పాంటు మొన్ననే చిరిగిపోయింది" అన్నాడు బాధగా.

రాజు మాటలు ఒకవైపు జాలి, ఒకవైపు అసహ్యం కలగజేశాయి రమణకి. అంత బట్టలు కుట్టించుకోవడానికి డబ్బులేనివాడు ఎందుకు చేరినట్లు? ఉన్న డబ్బు కాస్తా బృందావన్‌లోను, మార్కెట్లలోను పాడు చేసుకోవడం దేనికి? రమణ మాత్రం పైకి ఏమీ చెప్పలేకపోయాడు.

రమణకి మధ్యాహ్నం వరకూ కాళీ కనక తన వాచీ బాగు చేయించాలనుకున్నాడు. అలమారులో అంతా వెదికాడు. కాని వాచీ కన్పించలేదు. పుస్తకాలు అన్నీ చిందరవందర చేశాడు. రమణ కంగారుగా అలమారు వెదుకుతూనే ఔదురుగా అటువైపు చూశాడు. అంతా వెదికి వాచీపోయిందన్న నిర్ణయానికి వచ్చాడు. ఎందుకంటే అక్కడ దొంగతనాలు జరగడం అలవాటే. కిందటి సంవత్సరం పాత హాస్టలులో అలాంటివి ఎన్నో జరిగాయి.

"ఏమిటి వెదుకుతున్నారు" రాజు అడిగాడు.

"వాచీ పోయింది. ఇక్కడ వెయ్యికళ్లతో ఉంటేనే సామానులు మాయమవుతాయి. రాత్రి 2 గంటల వరకూ తలుపులు తెరుచుకుని పడుకుంటే పోక ఏమవుతుంది?" రమణ కోపంగా అన్న మాటలు రాజు హృదయంలో సూదుల్లా గుచ్చుకున్నాయి.

రాజు ఏమీ మాట్లాడలేకపోయాడు.

పోయి ఉంటుందన్న నిర్ణయం చెయ్యగలిగాడు కాని వెదకడం మాత్రం మానలేకపోయాడు. పుస్తకాలు అన్నీతీసి మంచంమీద వేశాడు. అలమారులో పరిధివ పేపరు, వెనక చిన్న లేడీస్‌వాచి మెరుపులా మెరిసింది.

ఆత్రతగా చూస్తున్న రాజు ముఖంలో చిరునవ్వు కన్పించింది.

రమణ ముఖం చిన్నబోయింది.

సాయంత్రం రాజు బయటకు వెళ్లిపోయాడు. కాని రమణతో ఆ విషయం ఎలా చెప్పాలో తెలియలేదు.

"ఏమండీ, మీతో ఒక విషయం చెప్పాలను కుంటున్నాను. దయఉంచి అలా ఒకసారి వస్తారా?" రాజు అడిగాడు. రమణ మౌనంగా రాజు ననుసరించాడు.

ఇద్దరూ ఇన్‌స్టిట్యూట్ ఎదురుగాఉన్న గార్డెన్‌లోకి వెళ్లి కూర్చున్నారు. రాజు ఏ విషయం చెప్పుతాడో అని రమణ ఎదురు చూస్తున్నాడు.

"రమణగారు మా అమ్మకు చాలా సీరియస్‌గా ఉందని నా స్నేహితుడు చెప్పాడు. అవిడకు సంపించ డానికి కొంత డబ్బు కావాలి. . . ."

"ఎంత కావాలి" మధ్యలో రమణ అడిగాడు.

"ప్రస్తుతం ఏమీ అక్కరలేదు. బృందావన్ యజమాని కృష్ణమూర్తిగారిని అడిగాను. ఆయన ఈ రోజు రాజంపేటనుండి ఇక్కడకు వస్తారు. ఆయన రాగానే ఆ డబ్బు తీసుకుంటాను..."

ఈ విషయాలన్నీ ఎందుకు చెపుతున్నాడో రమణకి అర్థం కాలేదు.

"వాయందు దయ ఉంచి ఈ ఒక్కరోజు నన్ను టౌనుకు వెళ్లనివ్వండి. మా అమ్మకు డబ్బు చాలా అవసరం. మా అమ్మమ్మ బ్రతికించినవారవుతారు. మీరీ ఒక్క సహాయం చేస్తే చచ్చి మీ కడుపున పుడతాను" రాజు వణుకుతున్న స్వరం రమణను కుంగదీసింది.

రాజు ఇంక మాట్లాడలేకపోయాడు.

"పోనీలెండి. ఈ విషయాలన్నీ మర్చిపొండి! నాకీ విషయం తెలిస్తే అలా అని ఉండేవాణ్ణికాను" రాజుని బుజ్జగించాడు రమణ.

రాజు కృతజ్ఞతాపూర్వకంగా రమణవంక చూసి నవ్వాడు.

ఆరోజు రాత్రి కూడా సీనియర్లు రాజు కోసం చూశారు. కాని కనిపించలేదు. వాళ్లంతా రమణను వేధించుకు తినడం మొదలుపెట్టారు.

"ఎక్కడికి పోతాడురా! ఎన్నాళ్లని తప్పించు కోగలడు? ఇంతవరకూ ఎవరూ ఈ రాగింగ్‌నుంచి తప్పించుకోలేకపోయారు." వెంకటేశం ఉక్రోషం అణుచుకోలేకపోయాడు. మిత్రబృందమంతా ఒక నిర్ణయం తీసుకోవడానికి కామన్ రూముకి వెళ్లి పోయారు.

● ● ● ●

రెండుమూడు రోజులు గడిచిపోయాయి. రాజు అలానే ప్రతిరోజు బయటకు వెళ్లిపోతున్నాడు. రమణ ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. కాని సీనియర్లు అవకాశం కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.

ఆరోజు మంగళవారం. రమణ లేచేసరికి రాజు ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. అన్ని పనులు పూర్తి చేసుకుని మెన్సుకి హడావిడిగా బయలుదేరాడు. వరండా చివరకి వెళ్లగానే

"సార్ అటువైపు మెట్లవెంట పొండిసార్! వీటికి సిమెంటు చేస్తున్నాం" అన్నాడు సిమ్మెంటు గమేళా దింపుకుంటూ కూలివాడు. రమణ తిట్టుకుంటూ వెనక్కి వెళ్లిపోయాడు.

క్లాసు చాలా నిశ్శబ్దంగా జరుగుతున్నది. అంతా లెక్చరర్‌గారు చెప్పే లెక్కలో మునిగిపోయారు. ఇంతలో ఒక వ్యూన్ వచ్చి "సార్! ఎవరో ఫస్టుఇయర్ స్టూడెంటు పైనుంచి పడిపోయారు."

అందరూ ఒకరి ముఖంవంక ఒకరు చూసుకున్నారు. రమణ క్షణకాలం స్తంభించిపోయాడు.

లెక్చరర్‌గారు క్లాసు వదలి హాస్టలువైపు దారి తీశారు. మిగిలిన వాళ్లందరూ ఆయన ననుసరించారు.

హాస్టలుమెట్లవద్ద గుంపుగా కూడారు అందరూ. వాళ్లను త్రోసుకుని గుంపులోకి దూరాడు రమణ. తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. రాజు నేలమీద స్పృహ లేకుండా పడి ఉన్నాడు. ముఖంనిండా నెత్తురు మరకలున్నాయి. కాళ్లకింద భూమి కంపించినట్లయింది రమణ నోట మాట రాలేదు. స్థాణువులా ఉండి పోయాడు.

రాజును ఇన్‌స్టిట్యూట్ కారులో వెనకసీటులో పడుకోబెట్టారు. కారు హాస్పిటల్‌కి దూసుకుపోతున్న శబ్దానికి రమణలో చలనం కలిగింది. రాజు పడిపోయిన చోట చెమ్మ మట్టిలో కవరు ఒకటి పడివుంది. సగం తడిసిన కవర్ని తీసి చూశాడు. దానిమీద వ్రాత అస్పష్టంగా ఉంది.

అదురుతున్న గుండెల్ని అదిమిపట్టుకుని రమణ రూములోకి వెళ్లిపోయాడు. రాజు దేవుడి దగ్గిర వెలిగించిన అగరువత్తులు ఇంకా కాలుతున్నాయి. పక్కనే ఒక అరటిపండు ఉంది. రమణకు దుఃఖం ముంచుకు వచ్చింది. రాజు ప్రతీరోజు ఆ అరటిపండు తనకు ఇచ్చేవాడు. ఇప్పుడు దానిని చూస్తూంటే రమణకి పిచ్చెక్కినట్లయింది. తల పట్టుకుని కుర్చీలో ఒరిగి పోయాడు. వేరొక కవరు మీద కొత్త ఎడ్రసు వ్రాసి మట్టిలో తడిసిన కవరు విప్పాడు దానిలో ఒక ఉత్తరం పదిరూపాయిలనోటు కనిపించాయి రమణ ఉత్తరం మడతలు విప్పి చదవడం మొదలుపెట్టాడు.

"డియర్ శంకరం,

నేను ఇక్కడ క్షేమముగా ఉన్నాను. అక్కడ మన వాళ్ళందరూ క్షేమమని తలంచుచున్నాను. చాలా కాలానికి నీకు ఉత్తరం వ్రాస్తున్నందుకు విచిత్రంగా ఉంది కదూ! అసలు నేను ఇంతకాలం ఎక్కడున్నానని అనుమానంగా ఉందికదూ! బహుశా వెంకన్న ఈ పాటికి నా వివరాలు చెప్పే ఉంటాడు. నేను ఎందుకు అక్కణ్ణించి పారిపోయి వచ్చానో నీకు ఇప్పుడు తెలియపరచాలనుకుంటున్నాను. దయఉంచి నాపై కోపం మరిచి ఈ ఉత్తరం చివరిదాకా చదివి ఆ తరవాత నీకు ఎలా తోస్తే అలా చెయ్యి.

కొందరి జీవితాలు పరిచిన విస్తరాకు వంటిది. కాని జీవితం నాబోటి వాళ్ళకు తుపాను లాంటిది. అసలు నా జీవితం గాలివానతో ఆరంభమైంది. ఈ విషయం నేను ఇక్కడకు వచ్చేముందరే తెలుసుకున్నాను. మా వదిన నేను ఎవర్నో, నా గమ్యం ఏమిటో తెలియపరిచింది. మా అమ్మ ఎవరో నీకు తెలుసా? ఆ ప్రశ్న నీకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. నన్ను పెంచినతల్లి, లోకానికి నా తల్లిగా కనిపించే ఆమె నిజానికి నా తల్లికాదు. ఒకప్పుడు నిజం కూడా చేదులా ఉంటుంది. నా తల్లి ఎవరో నాకు తెలియదు. నవమాసాలు మోసి కన్నతల్లే నాకు కనిపించనప్పుడు నా తండ్రి ఎవరని చెప్పగలను? నేను డబ్బుకి పేదవాణ్ణి అనుకున్నాను. కాని కులానికి కూడా పేదవాణ్ణే. నేను ఈ భూమిమీద అడుగు పెట్టక ముందే నాకు శత్రువులు తయారయ్యారు. నా తల్లే నన్ను చంపాలని ప్రయత్నించింది. నేను రెండు



అవతారపురుషుడు

కత్తిరింపు చిత్రం—మందార రామచంద్ర (అలీసాగర్)

రోజులు పసికందుగా ఉండగా నన్ను ఒక పావపు మూట అని మా అమ్మ మా ఊరి చెరువుగట్టుమీద పడలింది. ఒక రాత్రి గాలిదుమారంలో అనుభవం పొందిన నన్ను, మీరందరూ ఆ అమ్మ అని పిలిచే మా అమ్మ పెంచింది. నిన్న మొన్నటివరకు ఆమె నా స్వంతతల్లి అనుకున్నాను. అన్న నా అన్న అనుకున్నాను. అన్నయ్య పెళ్ళికాగానే వదిన నా జీవితచరిత్ర తెలియ పరిచి, నా దారి నన్ను చూసుకోమని చెప్పింది.

"ఈ విషయాలు ఇంతవరకూ ఎవ్వరికీ తెలియవు. అమ్మకు ఈ విషయాలు చెప్పి ఆమెను బాధించబోక చీకటితో దారి వెదుక్కుంటూ ఇక్కడికి చేరుకున్నాను. నేను ఊరికి శాశ్వతంగా దూరం కావాలని, నేను చెయ్యని తప్పు నా మీద వేసుకుని పారిపోయి వచ్చాను.

రామాలయంలో వస్తువులు ఎలా పోయాయో చెప్పడం నా కిష్టంలేదు. నేను కులట కొడుకునన్న విషయాన్ని చెప్పడానికి వెనకాడను. కాని వదిన జీవితాన్ని నాశనం చేసి, అన్న హృదయంలో నిప్పులు చెరగడానికి, అమ్మకు మాయమాటలు చెప్పడానికి పిరికివాణ్ణి అయిపోయాను. అందుకే ఉన్న ఊరు వదిలి తెగిన గాలిపటంలా మాయని దొంగతనం మోసుకుని ఇంత దూరం పారిపోయి వచ్చాను. నా అదృష్టం బాగుండి ఇక్కడ మంచివారి పంచన చేరగలిగాను. బృందావన్ లాడ్జి ప్రొప్రయిటరు కృష్ణమూర్తిగారు నాకు ఆశ్రయం ఇచ్చారు. ఆయన హోటల్ అసోసియేషన్ ప్రెసిడెంటు. అసోసియేషన్ స్కాలరుషిప్ నాకు ఇప్పించారు. నా చదువుకి అయ్యేడబ్బు అసోసియేషన్ వారు ఇస్తున్నారు. ఇంతకీ నేను చదివే చదువు ఏమిటో తెలుసా "వంటల చదువు". ఈ గ్రుడ్డివాడికి అదొక్కటే మిగిలిందిరా! ఈ డిప్లమో పూర్తికాగానే టూరిస్టుషాప్‌లో ఉద్యోగం ఇప్పిస్తానన్నారు. నేను ప్రతిరోజు సాయంత్రం 5 గంటలనుండి 10 గంటల వరకు బృందావన్‌లో పనిచేస్తున్నాను. దానికి కొంత డబ్బు అదనంగా వస్తుంది. ఇలానే నా జీవితం గడిచి పోతుంది. నాకు ఏ బాధాలేదు, ఒక్క అమ్మ విషయం తప్ప.

"వారం రోజుల క్రితం వెంకన్న అనుకోకుండా ఇక్కడ కనిపించాడు. అక్కడ పరిస్థితులు అన్నీ చెప్పాడు. అమ్మ మంచాన పడి ఉందని, వదిన సరిగ్గా చూడడంలేదని, అన్నయ్య అస్తమానం తాగి చేలగట్టు మీద పడిపోతున్నాడని చెప్పాడు. అమ్మకు కనీసం మంచినీళ్లు పోసేవారు లేరని తెలియగానే నాకు పుట్టెడు దుఃఖంవచ్చింది. నేను స్వంతకొడుకుని కాకపోయినా, నేను ఎలా మరిచిపోగలను అమ్మ నా కోసం పడిన బాధలు? ఎవరు కాదన్నా అమే నా అమ్మ. అమ్మను చూడాలని, అమ్మ ఆరోగ్యం ఎలా ఉన్నదో అని నాకు బాధ కలిగినా, నేను ఆ ఊరికే శాశ్వతంగా దూరమైపోయాను. ఇప్పుడు అక్కడకు వస్తే అందరూ నా నేరాన్ని చూసి ముఖంమీద తిట్టిపోస్తారు శంకరం! అమ్మమీద ప్రమాణంగా చెపుతున్నాను. రామాలయంలో వస్తువులు మా ఇంటికి ఎలా వచ్చాయో నాకు తెలుసు. కాని ఆ పని నేను చెయ్య లేదు. నా మాట నమ్ము.

"అమ్మ మంచాన పడిఉందని, చాలా ఎక్కువగా ఉందని వెంకన్న చెప్పినప్పటినుండి అమ్మకోసం డబ్బుపంపాలని ఆత్రపడ్డాను. దేవుడి దయవల్ల ఈరోజు పదిరూపాయలు సంపాదించాను. ఈ ఉత్తరంతోపాటు పది రూపాయిలనోటు పంపిస్తున్నా.. నేను పంపించినట్లు ఎవ్వరికీ తెలియనివ్వకు. అమ్మకు ఏమి కావాలంటే అవి కొనిపెట్టు. నా తల్లి ఋణాన్ని ఇంతకన్నా నేను తీర్చుకోలేను. నా మీద కోపాన్ని మరిచిపోయి, నా కోరిక తీరుస్తావని నమ్ముతున్నాను. ఒరే ఈ ఒక్క సహాయం చేస్తే చచ్చి నీ కడుపున పుడతానురా!

"మన పూజారిగారు బాగున్నారా? ఆయన నా గురించి ఏమంటున్నారు? ఆయన ఇచ్చే ప్రసాదమంతా నువ్వే తినేస్తున్నావు కదూ? అన్నట్లు చెప్పడం మరిచాను, మా రూమ్‌మేటు రమణగారు అచ్చంగా నీలాగే ఉంటారు. పూజారిగారు ఇచ్చిన ప్రసాదం తెచ్చి నీకు ఇస్తుండేవాణ్ణి. ఇక్కడ అదే అలవాటు అయింది. నేను పూజ ముగించి మా రూమ్‌మేటుకి ప్రసాదం ఇచ్చి, నీకు ఇచ్చినట్లే మురిసిపోతూంటాను. ఆయనను చూడగానే ఆయనలో నువ్వే కనిపిస్తావు. నువ్వు గుళ్లోకి రాకపోతే దేవుడిగంట నీకు బదులుగా నేనే మోగించేవాణ్ణి. ఇప్పుడు నాకు బదులుగా గుడిగంటలు మోగిస్తావు కదూ? ఆ గంటల ధ్వని ఇక్కడవరకూ వినిపించకపోయినా, కనీసం మన నాలుగు చీధుల చారిలో వినిపిస్తే నా పాపం పవిత్రమైందని తలుస్తాను.

నా తల్లికి నేను చెయ్యగలిగిన సహాయం ఇంత కన్నా ఏముంటుంది. నేను దారితప్పినప్పుడు చేయూత ఇచ్చే స్నేహితుడు, దారిలో గొప్పు తగిలి పడిపోయి నప్పుడు అమ్మా అని పిలిస్తే పలికే అమ్మ దూరమై నేను ఇక్కడ చీకటిలో బ్రతుకుతున్నాను. స్నేహితుడు, అమ్మా లేకపోయినా, చమటపోడ్చి కడుపు మాడ్చుకుని పట్నంనుండి అమ్మ తెప్పించి ఇచ్చిన కళ్ళజోడే నా అమ్మ, స్నేహితుడు.

డబ్బుతో కొనలేని తల్లిప్రేమకి నేను పంపే కానుక అందజేస్తావు కదూ? చచ్చి నీ కడుపునే పుడతానురా!

ఇట్లు,
మీ రాజు."

రమణ కళ్ళవెంట కన్నీళ్ళు బొటబొటా కారాయి. ఉత్తరాన్ని మడిచి కొత్త కవర్లో పెట్టి అంటించాడు. రమణ తనలో బాధను దాచుకోలేకపోయాడు. తలుపులు మూసి చిన్న కుర్రవాడిలా ఏడ్చాడు. వెంకటేశ్వరస్వామికి తన జీవితంలో తొలిసారి నమస్కరించాడు రాజుని తనకు దూరం చెయ్యవద్దని మొక్కుకున్నాడు.

తన పాపపు చేతులతో రాజుకి సహాయం చేస్తే తన పాపం పోతుందని, కవరు తీసుకుని రెండంగలలో పోస్టుబాక్సులో వేసివచ్చాడు,

రాజు ఎలా పడిపోయాడన్న విషయం అందర్నీ వేధించింది. ప్రిన్సిపాలుగారు అక్కడున్న వాళ్ళందర్నీ విచారించి రాజు పైనుండి జారి పడిపోయినట్లు నిర్ధారణ చేశారు. రమణ మాత్రం దానితో ఏకీభవించ లేకపోయాడు.

రాజు మూసినకన్ను తెరువలేదు. స్పృహలేకుండా అలానే పడిఉన్నాడు.

ఆ రాత్రి హాస్టలు చాలా నిశ్శబ్దంగా ఉంది. రాగింగ్ కార్యక్రమాలు ఆగిపోయాయి. ఎవరికి వాళ్ళే బుద్ధిమంతుల్లాగ తలుపులు మూసుకుని చదువుకోవడం మొదలెట్టారు. రమణ చీకటి గదిలో తలగడ మీద తలదాచుకుని ఏడ్చాడు. ప్రతి రోజు రాజు కోసం ఎలానే ఎదురు చూసేవాడు. ఇప్పుడు రాజు... తలుచుకుని పదేపదే కుమిలి పోయాడు..

మరునాడు ఉదయం రమణ హాస్పిటల్‌కి చేరుకునే సరికి, ప్రిన్సిపాలుగారు, బృందావన్ యజమాని కృష్ణమూర్తిగారు గది బయట నిలబడ్డాడు. ఇద్దరూ రమణవంక చూసి తల వంచుకున్నారు.

రమణ దగ్గరకు వెళ్ళగానే ప్రిన్సిపాలుగారు ఒక టెలిగ్రాం కవరు ఇచ్చారు. రాజు తల్లి చనిపోయిందని స్నేహితుడిచ్చిన టెలిగ్రాం అది.

"రాజూ!" బిగ్గరగా అరిచాడు రమణ. కళ్ళ కొలుకుల్లో తొంగిచూస్తున్న నీటిబిందువులు జల జలా రాలాయి.

టెలిగ్రాం కవరు తీసుకుని రమణ గదిలోకి వెళ్ళాడు. రెండు మూడుసార్లు పిలిచాడు. రాజు పలకలేదు. రాజు తనకు దూరమైపోయాడని తెలియగానే "రాజూ!" అంటూ బావురుమన్నాడు.

ప్రిన్సిపాలుగారు వచ్చి రమణను బయటకు తీసుకుని వెళ్లారు. రమణ కన్నీళ్ళు తుడుచుకుంటూ, తనకు ఋణం తీరిపోయిన రాజుని వదిలి భారంగా హాస్టల్ వైపు దారితీశాడు.

వెనక ప్రిన్సిపాలుగారు అన్న మాటలు చాలా స్పష్టంగా వినిపించాయి రమణకు.

"పాపం, రాజు రూమ్‌మేటు. మీరు రాజును గురించి చెప్పగానే రమణ అయితే సహకారిగా ఉంటా డని, రాజుని ఆ రూములో వేశాను. చూశారా! వారం రోజులలో వాళ్ళస్నేహం. . ."

ఆయన మాటలు శూలాల్లా గ్రుచ్చుకున్నాయి రమణ హృదయానికి.

కళ్ళలో నిండిన నీళ్ళను దులుపుకుంటూ, దారి వెదుక్కుంటూ వెళ్ళిపోయాడు రమణ.

ఆ రోజు ఇన్‌స్టిట్యూట్‌కి సెలవు ఇచ్చాను.

వారాలు, నెలలు గడిచిపోయాయి.

రమణ కళ్ళలో ఆ సంఘటన ఇంకా నిలిచిపోయింది. రాజు ఎలా చచ్చిపోయాడన్న ప్రశ్న అలానే ఉండి పోయింది.

* * *

"నేను వెళ్ళివస్తాను రమణా, దేవటివాడం వచ్చేటప్పుడు రంగడికి కావలిసిన కళ్ళజోడు తీసుకుని వస్తాను" డాక్టరు మాటలతో రమణ ఈ లోకానికి వచ్చాడు. రమణ రంగడి ముఖంలోకి చూశాడు. రంగడిలో రాజు పోలికలు కన్పించాయి. నిజంగా రాజు చచ్చి తన కడుపునే పుట్టాడు. అవును రాజు ఎప్పుడూ దూరం కాలేదు.

"రాజూ!" రమణ పిచ్చిగా కేకపెట్టాడు. ఆ కేకతో హాలు ప్రతిధ్వనించింది.

కేకవచ్చిన వైపు చూసి నవ్వాడు రంగడు.

రమణ తన బీరువాలోంచి కళ్ళజోడు ఒకటి తీసి,

"రాజూ, ఇదిగో నీ కళ్ళజోడు. ఇంకా భద్రంగా ఉంచాను నా నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి. ఆ నాడు నిన్ను రాగ్ చెయ్యాలని కళ్ళజోడు దాచాను. కాని దేవుడు ఇంత పెద్దశిక్ష విధిస్తాడని అనుకోలేదు" అంటూ రంగడికి కళ్ళజోడు తగిలించాడు. అంగుళం దళసరి అద్దాలలోంచి ప్రశాంతంగా కనిపించాయి రంగడి కళ్ళు.

తనలో దాచుకున్న బాధ తీరిపోయిందన్నట్లు నిట్టూర్చాడు రమణ.

ఇదేమీ అర్థంకాని డాక్టరు చూస్తూండిపోయాడు రంగడి కళ్ళజోడు వైపు. ★

> ప్రేమించిన స్త్రీ సంకోచాన్ని క్రమంగా విడనాడుతుంది; పురుషుని సంకోచం అధికంగా ఆవహిస్తుంది.
>
> —రిక్టర్